

# కవ్వాల్ టైగర్ జోన్‌కు ఇటుక సెగ

## అడవి నడిబొడ్డున అక్రమ బట్టీలు!

### టైగర్ జోన్ నిబంధనలు గాలికి.. యథేచ్ఛగా ఇటుకల తయారీ

### అధికారుల అండతోనే దందా.. ప్రజా సంఘాల ఆగ్రహం

అడవిని కాపాడాల్సిన చోట దాన్ని దహించే ప్రమాదం పొంచి ఉంది. టైగర్ జోన్ నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల కళ్లు గప్పి కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఇటుక బట్టీలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలం ఇంధన్ పల్లి ఫారెస్ట్ జోన్ పరిధిలో ప్రధాన రహదారిని ఆనుకుని వెలుస్తున్న ఈ బట్టీలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**తుడుం జితేందర్**

జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో



### నిబంధనలు బేఖాతరు.. నోటీసులకే దిక్కులేదు

గతంలో ఈ బట్టీల నిర్వహణపై ఫారెస్ట్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. నోటీసులు అందుకున్న సమయంలో కొద్దిరోజుల పాటు పని నిలిపివేసిన నిర్వాహకులు.. ఇప్పుడు మళ్లీ యథావిధిగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. టైగర్ జోన్ వంటి అత్యంత సున్నితమైన అటవీ ప్రాంతంలో ఇలాంటి భారీ ఇటుక బట్టీలకు అనుమతులు ఎలా లభిస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

### అడవికి పొంచి ఉన్న పెను ప్రమాదం

ఈ ఇటుక బట్టీల వల్ల అడవికి కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఇటుకలను కాల్చే సమయంలో వచ్చే చిన్న నిప్పు రవ్వ అడవిలో పడితే క్షణాల్లో వేల ఎకరాల అటవీ సంపద బూడిదయ్యే ప్రమాదం ఉంది. టైగర్ జోన్ వన్యప్రాణుల ఆవాసం కాగా.. బట్టీల నుంచి వచ్చే పొగ, వేడి, నిరంతరం తిరిగే వాహనాల వల్ల వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. వందలాది మంది కార్మికులు ఇక్కడ పనిచేస్తున్నా వారికి కనీస రక్షణ లేదు. అసలు కార్మిక శాఖ నుంచి వీటికి అనుమతులు ఉన్నాయా అనేది అనుమానమే.

### అధికారుల మౌనం.. ప్రజా సంఘాల ఆగ్రహం

నిర్వాహకులను ప్రశ్నిస్తే తమకు గ్రామ పంచాయతీ, మండల కార్యాలయం, ఫారెస్ట్ అధికారుల అనుమతులు ఉన్నాయని సమాధానం ఇస్తున్నారు. కానీ టైగర్ జోన్ పరిధిలో ఇలాంటి కాలుష్య కారక పరిశ్రమలకు అనుమతి ఇచ్చే అధికారం ఎవరికీ ఉండదని నిపుణులు చెబుతున్నారు. అడవిని కాపాడాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా అని జన్నారం మండల నాయకులు, ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇంధన్ పల్లి పరిధిలోని అక్రమ ఇటుక బట్టీలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అడవిని కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

### జేఏసీ 2026 క్యాలెండర్‌ను విడుదల చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

### ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంయుక్త చర్యా సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, టౌన్ ప్రెసిడెంట్ హత్తు ఇమామ్ పాల్గొన్నారు.

### ఉద్యోగుల సేవలు మరువలేనివి

ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. ఉద్యోగ భద్రత, సముచిత వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల అమలులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం ఎంతో గుర్తిస్తోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ జేఏసీ చైర్మన్ పుల్లగూర్ల రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పొన్నమల్ల యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెట్లపల్లి రాజేష్, కైరంకొండ బిక్షపతి, పోతుల రాజమల్లు, సాదిక్ వసూద్దీన్, తలారి రామచంద్రం హాజరయ్యారు. వీరితో పాటు తదితర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఔట్‌సోర్సింగ్ జేఏసీ కమిటీ విజయవంతంగా నిర్వహించింది.



# మైసంపల్లిలో నీటి కష్టాలకు శాశ్వత చెక్

### కొత్త పైప్‌లైన్‌తో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు కనెక్షన్

### పనులు పర్యవేక్షించిన సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామ సర్పంచ్ చర్యలు చేపట్టారు. సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో నల్లాల బోర్ నుంచి బీసీ కాలనీలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌కు కొత్త పైప్‌లైన్ ద్వారా కనెక్షన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ బోర్ ద్వారా ట్యాంక్‌లో నీటిని నింపే విధంగా ఏర్పాట్లు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం కోసం ఈ పైప్‌లైన్ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ చర్యలతో బీసీ కాలనీ ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా అందుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అభివృద్ధి పనులు కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.



# సిద్దిపేటలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

### ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని స్థానిక ఈద్గా మైదానంలో శుక్రవారం సాయంత్రం తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి సిద్దిపేట జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని వారందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో సామరస్య వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, అతుబాయి, ఇతర నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముస్లిం సోదరులు, మిత్రుల కలయికతో ఇఫ్తార్ విందు ఎంతో విజయవంతమైంది.





# మోడీ దిష్టిబొమ్మను దహనం చేసిన జగ్గారెడ్డి

**రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనానికి సంగారెడ్డిలో కౌంటర్**

**గ్యాస్ కొరతపై నిలదీస్తే అక్రమంగా టార్గెట్ చేస్తారా అని మండిపాటు**

**సంగారెడ్డి, మార్చి 15 (జనం పవర్):** దేశంలో గ్యాస్ కొరతపై పార్లమెంటు బయట నిరసన తెలిపిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు దహనం చేయడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల తీరుకు నిరసనగా శనివారం సంగారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రధాని మోడీ దిష్టిబొమ్మను జగ్గారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులు దగ్ధం చేశాయి. ఈ క్రమంలో వారిని అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తీవ్ర తోపులాట జరిగింది. ఎట్టకేలకు కాంగ్రెస్ నేతలు మోడీ దిష్టిబొమ్మను తగలబెట్టి నిరసన తెలిపారు.

**అమెరికా ఒత్తిడికి తలొగ్గిన మోడీ**

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల వల్లే దేశంలో గ్యాస్ కొరత ఏర్పడిందని విమర్శించారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుంచి ఆయిల్, గ్యాస్ దిగుమతులు చేసుకోవడంలో ప్రధాని మోడీ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రష్యా నుంచి ముందే దిగుమతి చేసుకుని ఉంటే ఇరాన్ యుద్ధం వల్ల ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. తాజా గ్యాస్ కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్యాస్ దొరక్క హోటళ్లు కూడా మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడి గ్యాస్ కొరత తీర్చాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తే.. ఆయన సూచనలు పట్టించుకోకుండా బీజేపీ నేతలు ఇలా దిష్టిబొమ్మలు దహనం చేయడం విడ్డూరంగా ఉందని జగ్గారెడ్డి మండిపడ్డారు. దేశ ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం కూడా తప్పేనా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

# 5వ వార్డులో సందడిగా 'బాల మేళా'

**అంగన్వాడీ చిన్నారుల ఆటపాటలతో ఆకట్టుకున్న వైనం**

**పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీలకు పంపాలని సూచన**



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని 5వ వార్డులో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదు అంగన్వాడీ సెంటర్లకు చెందిన చిన్నారులు, వారి తల్లులు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. అంగన్వాడీ పాఠశాలల్లో పిల్లలు నేర్చుకున్న విద్యతో పాటు ఆటలు, పాటలు, నృత్యాలను ప్రదర్శించేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల ఆటలు, డ్యాన్సులతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలకు చదువుతో పాటు వివిధ కళలు అబ్బుతాయని, అవి వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని వక్తలు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ పాఠశాలలకు పంపాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో పిల్లలందరికీ స్టీల్ టిఫిన్ బాక్సులను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ సతీమణి లావణ్య, డీడబ్ల్యూఓ శారదా, సూపర్వైజర్ స్వప్న, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, చంద్రకళ, స్వప్న, సరస్వతి, మహేశ్వరి, సంతోషి, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



# బాలికల పాఠశాల గేటు వద్ద మద్యం బాటిళ్లు

- మందుబాబుల ఆగడాలపై స్థానికుల ఆందోళన
- కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్






**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట టౌన్ బాలికల పాఠశాల గేటు ముందు మద్యం బాటిళ్లు పడివుండడం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కొందరు వ్యక్తులు పాఠశాల గేటు వద్ద బీరు, మద్యం సేవించి బాటిళ్లను అక్కడే వదిలి వెళ్లిపోతుండడం వల్ల పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత ఏర్పడుతోంది. విద్యా దేవాలయాల ముందు ఇలాంటి సంఘటనలు జరగడం విద్యార్థినులు, తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

ఉదయం పాఠశాలకు వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గేటు వద్ద మద్యం బాటిళ్లు కనిపించడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లో ఇలాంటి పరిస్థితులు ఉండడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని వారు ఆవేదన చెందుతున్నారు. అలాగే అక్కడ పారిశుద్ధ్య కార్మికులు ఈ విషయాన్ని గమనించకపోవడం కూడా గమనార్హమని స్థానికులు చెబుతున్నారు. వెంటనే మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి పాఠశాల పరిసరాల్లో శుభ్రతను పరిరక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



# సిద్దిపేటలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

**బాలికల ఉన్నత పాఠశాలలో ప్రశాంత వాతావరణం**

**పటిష్ట బందోబస్తు మధ్య విద్యార్థుల హాజరు**

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే విద్యార్థినులు తమ తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాబితాల్లో తమ హాల్ టికెట్ నంబర్లను పరిశీలించి, కేటాయించిన పరీక్షా హాళ్లకు విద్యార్థినులు వెళ్లారు.

పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిబ్బంది పర్యవేక్షణలో విద్యార్థినులను పరీక్షా హాళ్లలోకి పంపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వర్తించారు.

పరీక్షలు ప్రారంభమైన అనంతరం విద్యార్థినులు ప్రశాంతంగా పరీక్ష రాశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పరీక్షలు నియమ నిబంధనల ప్రకారం సజావుగా కొనసాగుతున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు శుభాకాంక్షలు తెలుపుతూ పరీక్షలు విజయవంతంగా రాయాలని ఆకాంక్షించారు.



# కవ్వాల్ టైగర్ జోన్‌లో ఆగని వేట

## చిరుత హత్యపై వెల్లువెత్తుతున్న నిరసనలు!

## అటవీ అధికారుల తీరుపై భగ్గుమంటున్న ప్రజా సంఘాలు

**తుడుం జితేందర్ - జనం పవర్ - ఉత్తర తెలంగాణ బ్యూరో**

వన్యప్రాణుల రక్షణకు నిలయంగా ఉండాల్సిన కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో అటవీ అధికారుల నిర్లక్ష్యం ప్రాణుల పాలిట శాపంగా మారుతోంది. దండేపల్లి మండలం తాళ్లపేట అటవీ రేంజ్‌లో ఓ చిరుత పులిని ఉచ్చువేసి చంపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం స్థానికంగా కలకలం రేపుతోంది. జన్నారం ఎఫ్డీవో రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్ల గ్రామానికి చెందిన మొత్తే వెంకటేష్, మొత్తే శ్రీనివాస్ తో పాటు



పాతమామిడిపల్లికి చెందిన వనపర్తి శ్రీకాంత్ అనే ముగ్గురు వ్యక్తులు అటవీ ప్రాంతంలో క్లచ్ వైరుతో ఉచ్చు బిగించారు. ఇందులో చిక్కుకున్న చిరుత ప్రాణాలు కోల్పోగా, నిందితులు దాని గోళ్లను సేకరించారు. ఆ అవయవాలను విక్రయించే క్రమంలో సమాచారం అందడంతో అధికారులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.

**అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

ఈ ఘటనపై మండల వాసులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా చిరుత మృతదేహం అడవిలోనే ఉన్నా అది విక్రయానికి వెళ్లే వరకు అధికారులకు తెలియకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. కోట్లాది రూపాయల బడ్జెట్ ఉన్న టైగర్ జోన్‌లో స్మగ్లింగ్, అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. కేవలం అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ.. పలుకుబడి ఉన్నవారి దగ్గర డబ్బులు తీసుకుని వదిలేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఘటనపై వివరణ కోరేందుకు మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా సంబంధిత అధికారులు ఫోన్లు ఎత్తకపోవడం వారి బాధ్యతారాహిత్యాన్ని చాటుతోందని ప్రజలు



మండిపడుతున్నారు.

**సస్పెండ్ చేయాలని డిమాండ్**

లక్షల రూపాయల జీతాలు తీసుకుంటూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న బీట్ ఆఫీసర్ల నుంచి మొదలుకొని ఎఫ్ఆర్వో, ఎఫ్డీవో వరకు అందరినీ తక్షణమే సస్పెండ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

